క్లుప్తంగా

టీబీ వ్యాధిపై అశ్రద్ధ వహించొద్దు



ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రుద్రవరం: టీబీ వ్యాధిపై అశ్రద్ధ వహించొద్దని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆలమూరు పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వమే మందులు సరఫరా చేస్తుందని తెలిపారు.

పంచాయతీకి ఆదాయం



మార్కెట్ల వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలం పాటలో పంచాయతీకి స్వల్ప ఆదాయం వచ్చింది. సర్పంచ్ అయ్యలూరి సుభహాన్ ఆధ్యక్షతన డీఎల్‌డీపీఓ రాంబాబు పర్యవేక్షణలో వేలం పాటలు జరిగాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి వారం సంత, దిన, కబేలాకు వేలం పాటలు జరగగా పంచాయతీకి రూ. 15 వేల ఆదాయం సమకూరింది. గతేడాది రూ. 15.08 లక్షలు రాగా ఈ ఏడాది రూ. 16.23 లక్షలు ఆదాయం వచ్చింది. వారం సంతను శంకర్ రూ. 12.60 లక్షలకు పాడి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. దిన మార్కెట్‌ను శీలం రాంమోహన్ రూ. 1.87 లక్షలకు పాట పాడారు. కబేలాను రూ. 1.76 లక్షలు పలికింది. ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఈఓ హరిలీల పాల్గొన్నారు.

భూ సర్వేపై అవగాహన



పెద్దయమ్మనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న డీటీ, సిబ్బంది

ఉయ్యాలవాడ: భూముల రీసర్వేలో భాగంగా రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్దయమ్మనూరు గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. మండల పరిధిలో మొదటి విడత పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన ఎస్. కొత్తపల్లె గ్రామంలో రీసర్వే పనులు 90 శాతం మేరకు పూర్తయ్యాయన్నారు. రెండో గ్రామంగా పెద్దయమ్మనూరు గ్రామాన్ని ఎంపిక చేసుకుని భూసర్వేపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు ముందుగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారులు

దొర్నిపాడు: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. అలాగే కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, ఏఓ ప్రమీల, హౌసింగ్ ఏఈ బ్రహ్మం, ఏఎస్‌ఓ రామిరెడ్డి, పీఆర్ ఏఈ గౌస్, వెలుగు ఏపీఎం బాబు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

లారీల ఢీ.. డ్రైవర్ దుర్మరణం

బనగానపల్లి: మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పెదరాజుపల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం తెల్లవారుజామున అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ పర్వతదేవరపల్లి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా వేగాన్ని తగ్గించాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ ప్రసాద్ వేగాన్ని నియంత్రించుకునే సమయం కూడా లేకపోవడంతో ముందున్న లారీని ఢీకొన్నాడు. క్యాబిన్ నుజ్జునుజ్జయింది. క్యాబిన్‌లోనే డ్రైవర్ ప్రసాద్ చిక్కుకున్నాడు. స్థానికులు అతి కష్టంపై అతన్ని వెలికి తీశారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. బనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు తర్తూరు టోల్‌గేటు వేలం

జూపాడుబంగ్లా: తర్తూరు టోల్‌గేటు వేలం పాటలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ, సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఖాజా తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు రూ.15 వేల దరావత్తు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.



చిత్రేనిపల్లె వద్ద వరి కోస్తున్న యంత్రం



ధాన్యాన్ని ట్రాక్టరులో పోస్తున్న దృశ్యం

వరి కోతలు మొదలు

రుద్రవరం: మండలంలో రబీ సీజన్‌లో సాగుచేసిన వరి కోతలు ప్రారంభం అయ్యాయి. ఎకరానికి 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. అయితే ధర మాత్రం బస్తా(75కేజీలు)రూ.1575 పలుకుతోంది. మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 16 చెరువులు, 16 కుంటలు, 10 తెలుగు గంగ ఉప ప్రధాన కాల్వలు, బోరు బావుల కింద దాదాపు 4,690 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఆరుగాలం శ్రమించి రైతులు పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంట కాలం పూర్తి కావడంతో ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, హరినగరం, తండా తదితర గ్రామాల పరిధిలో కోతలు మొదలయ్యాయి. యంత్రాల ద్వారా కోతలు కోయించి వచ్చిన దిగుబడులను రొడ్లు, బయలు ప్రదేశాలకు తరలించి కుప్పలుగా పోస్తున్నారు. దిగుబడులు రావడం మొద లవ్వడంతో వ్యాపారులు రంగంలోకి దిగారు. రైతుల వద్దకు వెళ్లి బేరాలు మాట్లాడి బస్తా రూ.1575 ప్రకరాం కొనుగోలు చేస్తున్నారు. అయితే 40 బస్తాల దిగుబడులు వచ్చినప్పటికీ పెట్టుబడి ఖర్చులు పోను కాస్తో కూస్తో మిగులుతోందే తప్ప పెద్ద లాభాలు ఏమీ లేవని రైతులు వాపోయారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు సాగిస్తే మంచి లాభాలు వచ్చేవని రైతులు అసహనం వ్యక్తం చేశారు.



ముకుందాపురం వద్ద రోడ్డుపై కుప్పగా పోసిన ధాన్యం

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం





ఉయ్యాలవాడ పీహెచ్‌సీ ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది, శిరివెళ్లలో ర్యాలీ

ఉయ్యాలవాడ: క్షయ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధిపై మరింత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆయాసం, బరువు తగ్గడం, కఫ్ఫంలో రక్తం పడుట, చాతి నొప్పి, సాయంత్రం జ్వరం, రాత్రిపూట నిద్రలో చమటలు పట్టడం, తదితర లక్షణాలు వ్యాధిగ్రస్తులకు ఉంటాయని వివరించారు. ఆరు నెలల పాటు మందులు వాడితే రోగాన్ని జయించవచ్చన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

శిరివెళ్ల: క్షయ వ్యాధి అంటు వ్యాధి అని.. అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ముఖేష్ అన్నారు. సోమవారం వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు గాలి, క్రిముల ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మరణాలు కూడా సంభవించవచ్చన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వ్యాధి నివారణకు ఉచితంగా మందులను ఇస్తామన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం

చాగలమర్రి: టీబీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఎఫ్‌డీపీ జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రరెడ్డి అన్నారు. సోమవారం జాతీయ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా చాగలమర్రిలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్షయ వ్యాధి నివారణ ర్యాలీ, అవగాహన సదస్సులో పాల్గొన్నారు. అనంతరం డి.వనిపెంట గ్రామంలో 104 కార్యక్రమం, ముత్యాలపాడు–1,2 సచివాలయాల్లోని సబ్ సెంటర్లను పరిశీలించారు. ఎన్‌సీడీసీడీ సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆరోగ్య విస్తరణ అధికారులు జి.వెంకటేశ్వర్లు, కేవీ సుబ్బారాయుడు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



డి.వనిపెంటలో 104 సేవలను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్

క్షయను ప్రాథమికదశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు

నంద్యాల(అర్బన్): క్షయవ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చని చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యుడు షహలాం తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా రాబర్ట్ కోచ్ చిత్రపటానికి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ ఉదయ సంధ్యా, ఇన్‌చార్జి సీహెచ్‌ఓ శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటరాఘవ, స్టాఫ్ నర్సు జ్యోతి, చంద్ర, భారతి పాల్గొన్నారు.

వాసవీ జాగృతి చాప్టర్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ చాప్టర్ గవర్నర్‌గా బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఇంటర్నేషనల్ జయభేరి ఐకాన్ కాన్ఫరెన్స్ జరిగిన వాసవీ జాగృతి ఇంటర్ నేషనల్‌లో ఉమ్మడి జిల్లా సర్వసభ్య కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్ తిరువీధి వేణుగోపాల్ హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా కేబినెట్ సెక్రటరీగా మల్లిపెద్ది నాగరాజు, జిల్లా కేబినెట్ ట్రెజరర్‌గా బుగ్గల ధనుంజయ, వైస్ గవర్నర్‌గా శ్రీరామ సుబ్రహ్మణ్యం, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా కలికి సతీష్ కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌గా నెల్లూరు రామకృష్ణ, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రెటరీగా కొవ్వూరు నాగేంద్ర ప్రసాద్, డిప్యూటీ గవర్నర్‌గా బొగ్గరపు పుష్పలత, జోన్ చైర్ పర్సన్‌గా బచ్చు విజయకుమారి, జోన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా బొగ్గరపు జనార్ధన్ ఎన్నుకున్నారు.

చర్చీల్లో కొనసాగుతున్న శ్రమకాల ప్రార్థనలు

నంద్యాల(న్యూటౌన్): ప్రతి ఏటా క్రైస్తవులు నిర్వహించే భక్తి శ్రద్ధలతో 40 రోజుల పాటు నిర్వహించే శ్రమలకాల ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ఉదయం కొన్ని ప్రార్థనా మందిరాల్లోను, సాయంత్రం మరికొన్ని ప్రార్థనా మందిరాల్లోను ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. మనిషి మార్పుకు నిర్వహించేవే ఈ శ్రమ కాల ధాన్య ప్రార్థనలని మతపెద్దలు, గురువులు పేర్కొంటున్నారు. 40రోజుల ఉపవాసం వల్ల మనిషిలో తప్పకుండా మార్పు వస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఈనెల 5 నుంచి తపస్కాల ఉపవాసాలను ప్రారంభించారు. ఏప్రిల్ 18వ తేదీ గుడ్‌ఫ్రైడే, ఆ మరుసటిరోజు శనివారం వరకు లెంట్ డేస్ (తపస్కాలాన్ని...దుఃఖ దినాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ 40 రోజుల్లో విశ్వాసులు మద్యం, మాంసం జోలికి వెళ్లరు. ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. ఉదయం నుంచి ఉపవాసం ఉంటూ కేవలం రోజుకు ఒక్కపూట మాత్రమే అది కూడా రాత్రి ప్రార్థన అనంతరం ఆహారం స్వీకరిస్తారు. 20వ తేదీ ఈస్టర్ పండుగతో కార్యక్రమం ముగుస్తుంది.

డీలర్ తొలగింపుపై గ్రామస్తుల ఆందోళన

- అన్యాయంగా తొలగించడంపై చాపిరేవుల వాసుల ఆగ్రహం
- తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా
- ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం



ఆర్‌డీఓకు వినతి పత్రం ఇస్తున్న జయమ్మ, గ్రామస్తులు

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల గ్రామానికి చెందిన జయమ్మను డీలర్‌షిప్ నుంచి తొలగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు డీలర్‌షిప్ తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపు 300 మంది గ్రామస్తులు సోమవారం తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. స్టాక్ నిల్వలు అధికంగా ఉన్నాయంటూ పదిరోజుల క్రితం సీఎస్‌డీటీ ప్రసాదరావు రేషన్ షాపులోని ఈ–పాస్ మిషన్‌ను తీసుకొని షాపునకు తాళం వేసి వెళ్లారు. అప్పటికీ చాలా మంది కార్డుదారులకు రేషన్ ఇవ్వాల్సి ఉంది. రంజాన్, ఉగాది పండుగలు సమీపిస్తుండటంతో సరుకులు వస్తాయో లేదోనని కార్డుదారులు ఆందోళనకు గురయ్యారు. రాజకీయ కారణాలతో జయమ్మ రేషన్ షాపు మూతకు గురైందని తెలుసుకొని గ్రామస్తులు స్వచ్ఛందంగా వందలాది మంది తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్‌డీఓ కార్యాలయానికి చేరుకొని ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ కారణాలు ఏవైనా మరోమారు జయమ్మకు అవకాశం ఇస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయినా గ్రామస్తులు తక్షణమే జయమ్మకు రేషన్ షాపు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేయగా రెండు మూడు రోజుల్లో షాపు తెరిచి కార్డు దారులకు రేషన్ సరుకులు అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనుదిరిగారు. గ్రామస్తులు ఫక్రుద్దీన్, యశోదారెడ్డి, శంకర్‌రెడ్డి, జయమ్మ, లైసమ్మ, ఖాజా, ప్రదీప్, దస్తగిరి, వన్నూరు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ల బహిరంగ వేలం

శిరివెళ్ల: ఈనెల 25వ తేదీ స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్లకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఈఓ అశ్వనికుమార్ సోమవారం తెలిపారు. దిన మార్కెట్‌కు రూ. 3 లక్షలు, వారం సంత రూ. 3 లక్షలు, కబేలాకు రూ.25 వేల చొప్పున డిపాజిట్ చెల్లించాలన్నారు. పంచాయతీకి బకాయిలున్న వారు అనర్హులన్నారు. పాటలను వాయిదా వేయడానికి, రద్దు చేయడానికి పంచాయతీ, అధికారులకు పూర్తి అధికారం ఉందని తెలిపారు.

జూదరుల అరెస్టు

రుద్రవరం: మేజర్ పంచాయతీ రుద్రవరం సమీపంలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఏఎస్‌ఐ రాంభూపాల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామ సమీపంలోని మామిడి తోట పక్కన పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. హుసేనీ, హేమంత్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురు పట్టుబడ్డారు. మరో ఏడుగురు పారిపోయినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.35,250 నగదు స్వాధీనం చేసుకుని అందరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని ఆల్ఫా కాలేజీ సమీపంలోని హైవే పక్కన గుర్తుతెలియని మృతదేహం సోమవారం లభ్యమైనట్లు రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ పొలంలో చెత్తను కాల్చేందుకు నిప్పు పెట్టడంతో హైవే రోడ్డు పక్కన ఉన్న చెత్త కూడా తగలబడింది. దీంతో చెత్తలో ఉన్న గుర్తుతెలియని మృతదేహం కాలిపోయి బయట పడింది. మృతుడు సుమారు 10 రోజుల క్రితం మృతిచెందినట్లుగా ఉందని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

ఉయ్యాలవాడ: మండలంలో ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25, 26న తుడుమల దిన్నె, 26న ఆర్.జంబులదిన్నె, 27, 28న మాయలూరు, కొండుపల్లె సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, కార్డులో పుట్టిన తేదీ, చిరునామా, తదితర వాటిని సవరించుకోవచ్చన్నారు.

ఉపాధిలో బదిలీలు

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు సోమవారం కార్యాలయానికి అందాయి. స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీఓగా విధులు నిర్వహిస్తున్న రవిప్రకాష్ నందికొట్కూరు మండలానికి బదిలీ అయ్యారు. టీఏ షరీఫ్ ఆళ్లగడ్డ, బీఎఫ్‌టీలు రంగస్వామి, జ్వాలా నరసింహుడులు కొలిమిగుండ్ల, రుద్రవరం, సీఓలు మహబూబ్‌పీరా, మధుసూదన్‌రెడ్డి, చాగలమర్రి, డోన్ మండలాలకు బదిలీలు అయ్యారు. వీరి స్థానాల్లో ఏపీఓగా కొత్తపల్లె మండలం నుంచి హరికృష్ణ, దొర్నిపాడు నుంచి టీఏగా రాజు, బీఎఫ్‌టీగా హరిబాబు, సీఓలుగా దస్తగిరి, భద్రప్రసాద్ బదిలీపై రానున్నారు.

2న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

గోస్పాడు: శ్రీగుమ్మిత మల్లికార్జున, శ్రీవీరభద్రస్వామి మహోత్సవాల సందర్భంగా పామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం ఏప్రిల్ 2వ తేదీన ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి సోమవారం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని దీబగుంట్లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 2న సీనియర్ విభాగం, 3న న్యూకేటగిరి విభాగం, 4న పాలపండ్ల సైజు విభాగం ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. విజేతలైన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందజేస్తామని చెప్పారు.

సీతా కోక చిలుక

సీత



బర్రెలను మేపేందుకు వెళ్తున్న సీత

ఓర్పు, సహనం, దయ, కరుణ, ప్రేమ వంటి భావోద్వేగాలు చూపడంలో మహిళకు సాటిలేరంటారు. అందుకే ఆమెను సీతతో పోలుస్తుంటారు. ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న మహిళ దొర్నిపాడుకు చెందిన సీతమ్మ(75). ఈ వయసులో మండుటెండలో బర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తోంది. కాసేపు ఎండలో నిలుచోవాలంటే అలసిపోయే మనం ఆమె సహనానికి నిజంగా నీవు సీతవే తల్లీ అనాల్సిందే. అంతేగాక వాటికి మేత వేసి పాలు పితికి కేంద్రంలో పోయాలి. దినచర్యలో భాగంగా ఆమె రోజూ ఈ పనులన్నీ చేస్తానంటుంది.

కోక



మొక్కజొన్న పంటకు చుట్టిన కోక

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి రావాలంటే అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడులు అధికమయ్యాయి. వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో డబ్ల్యూకొత్తపల్లె శివారులోని ఓ పొలంలో పంట చుట్టూ పాత కోకలను అడ్డుతెరలుగా కట్టారు. ఇలా చేయడం వల్ల పందులు పొలంలోకి ప్రవేశించవని కర్షకులు చెబుతున్నారు.

చిలుక



జొన్నకంకిపై వాలిన చిలుక

ఎర్రటి ముక్కుకలిగిన పక్షుల్లో చూడముచ్చటగా కనిపించేది రామచిలుక. ప్రస్తుతం చిలుకలకు సంతానోత్పత్తి కాలం కావడంతో ఎక్కడ చూసినా జోడిగా కనిపిస్తూ సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా చిలుకలు జొన్నగింజలను ఆహారంగా తీసుకుంటాయి. గతంలో రైతులు ఇళ్ల వద్ద కేవలం చిలుకల కోసం జొన్న కంకులను కట్టేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో చిలుకలు పొలంబాట పట్టాయి. ఇటీవల క్రిష్టిపాడులోని జొన్నపంటను మిషన్‌తో కోయగా ఒకే ఒక్క జొన్న చెట్టు మిగిలింది. అది కాస్త చిలుక కంట పడడంతో కంకిపై కూర్చొని జొన్నలను తింటూ అందంగా కనిపించింది. –దొర్నిపాడు

మహానందీశుడి దంపతులకు పల్లకోత్సవం

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో సోమవారం రాత్రి పల్లకోత్సవం కనులపండువగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో ముందుగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీసేవను వైభవంగా చేశారు. ధ్వజ స్తంభం వద్ద హారతి తదనంతరం అలంకార మండపంలోకి చేర్చారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ఆళ్లగడ్డ: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలతో కేసులపై ఆరా తీశారు. కేసులను వాదించేందుకు న్యాయవాదులు ఉన్నారా అని ప్రశ్నించారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాలు, సూచనలు కావాలంటే ప్రతి మంగళ, శుక్రవారాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అందిస్తామని తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే లోక్ అదాలత్‌ను సంప్రదించవచ్చన్నారు. న్యాయ సేవల గురించి తెలుసుకోవాలంటే 15100కి కాల్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు. అర్హత ఉన్న ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సీ కులాల గణాంకాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): ఎస్సీ జనాభా కులాల వారీగా గణాంకాలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ప్రకారం 2011 జనాభా ప్రాతిపదికన ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో మాదిగలకు సమన్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం మరోసారి కమిషన్ నివేదికలను పరిశీలించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించి కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు రవికిరణ్, పూల రాజుమాదిగ, బాలరంగన్న, కృష్ణ, మహిళా నాయకురాలు రాదమ్మ, లక్ష్మిదేవి, మద్దమ్మ పాల్గొన్నారు.

భూమి కొలతల్లో తేడాలపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉయ్యాలవాడ: భూ రీసర్వే జరిగినా పొలాల కొలతల్లో తేడాలు ఉన్నాయని.. ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని రైతులు వాపోయారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సుద్దమల్ల గ్రామానికి చెందిన పల్లె శకుంతల, క్రిష్టిపాడు శకుంతల సాగు భూమిలో 3.14 ఎకరాల విస్తీర్ణంలో కొంత భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని.. ఈ భూమి ఎక్కడికి పోయిందని తహసీల్దార్ ముందు వాపోయారు. ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టిన బిల్లు మంజూరు కాలేదని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బాషా ఫిర్యాదు చేశాడు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం జరిగేలా చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ ఉన్నారు.

ఈద్ కిట్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్జీఓస్ కాలనీలోని పేదలకు ఈద్ కిట్ల పంపిణీ చేసినట్లు ఇసాక్‌వలి, డాక్టర్ యాకూబ్ తెలిపారు. సోమవారం తేహారా హెల్త్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నారాయణ పాండే పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించి 200 మందికి కిట్లు అందజేసినట్లు చెప్పారు. మతపెద్దలు మౌలానా అబూబకర్ సిద్దిఖ్, అఫీజ్ మహబూబ్‌పీరా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.